'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

సర్కారు లీకులు.. రైతులకు షాకులు!

గుండాల కృష్ణ
80966 77031

'స్థిరాస్తి వెంచర్ల పరిశ్రమలు.. 10 లక్షల ఎకరాలకు పైనే!.., రైతు భరోసాకు అర్హం కాని భూములు రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాలు.., సాగుకు యోగ్యం కాని భూములు మూడు లక్షల ఎకరాలు..' ఇవీ... దశాబ్దాల పాటు గోసపడిన తెలంగాణ రైతుకు పెట్టుబడి సాయం అందించకుండా పలు పత్రికలకు సర్కారు వారు ఇస్తున్న లీకులు. ఇంతకుముందే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేయలేక ఆపసోపాలు పడ్డది. అనర్హులు.. విధి విధానాలు.. అంటూ ఏడాది కాలంగా నెట్టుకొస్తూ తెలంగాణ రైతులను రెండుసార్లు పెట్టుబడి సాయానికి దూరం చేసింది. ఇప్పటికీ పథకాన్ని అమలుచేయకుండా ప్రభుత్వం ఇస్తున్న లీకులను చూస్తుంటే అసలు పథకానికే ఎగనామం పెట్టేందుకు సాకులు వెతుకుతున్నట్టుగా తోస్తున్నది.

రాష్ట్రంలో ముంచుకొస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారికి రైతు భరోసాను అరకొరగా అమలుచేసే అవకాశం ఉన్నదని కొందరు చెప్తున్నారు. అంటే ఏతావాతా సర్కారు అసలు ఉద్దేశాన్ని చూస్తే మాత్రం రైతుబంధుకు రాం.. రాం.. దిశగానే పాలకులు మొగ్గు చూపుతున్నారనేది స్పష్టంగా కనిపిస్తున్నది. ఎందుకంటే ఒక సంక్షేమ పథకంలో అనర్హులు ఉన్నారంటూ ఏడాది పాటు ఆ పథకం అమలునే నిలిపివేసిన చరిత్ర బహుశా దేశంలో మరెక్కడా లేదంటే అతిశయోక్తి కాదు!!

> **రాజీవ్ ఆరోగ్యశ్రీని ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చింది. ఏండ్ల తరబడి ఈ పథకంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, కార్పొరేట్ ఆస్పత్రులకు ఇదో కామధేనువుగా మారిందంటూ ఆరోపణలే కాదు, అందుకు అనేక ఆధారాలూ బయటికొచ్చాయి. అయినా... కేసీఆర్ ప్రభుత్వం ఈ పథకంలోని అవకతవకలను అరికట్టి... మరింత మెరుగ్గా అమలుచేసిందే తప్ప అందులో లోపాలున్నాయంటూ పథకాన్ని నిలిపివేయలేదు.**

అంతెందుకు.. రేషన్ కార్డుల ద్వారా నిరుపేదలకు అందే ఉచిత బియ్యం పక్కదారి పట్టిన సందర్భాలు అనేకం. ఇప్పటికీ ఆ ఛాయలు ఉండనే ఉన్నాయి. పొరుగు రాష్ట్రమైన ఏపీలో ఇటీవల ఏకంగా ఒక ఓడలో పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం సముద్రం దాటి విదేశాలకు తరలివెళ్తుండగా ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం అడ్డుకున్నారు. 'సీజ్ ది షిప్ (ఓడలోని బియ్యాన్ని సీజ్ చేయండి)' అని అన్నారే గానీ 'స్టాప్ ది స్కీం (ఉచిత బియ్యం పథకాన్ని ఆపేయండి)' అని అనలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ఉదాహరణలు. లోపాలను సరిదిద్దుకొని మరింత మెరుగ్గా రైతులకు మేలు చేయాల్సిన పాలకులు సాకులను వెతికి పథకాలకే ఎసరు పెట్టాలని చూస్తున్నరు.

అందుకే గత కొన్ని నెలలుగా తెలంగాణలో రైతు అంటే ఉత్త పుణ్యానికి ప్రభుత్వ ఖజానాను దోచుకున్నట్టుగా పనిగట్టుకొని బద్నాం చేసే కుట్రలు చేస్తున్నరు. రైతుబంధు పేరిట వేల కోట్ల రూపాయలు దుర్వినియోగమంటూ ప్రభుత్వ పెద్దలు మొదలు ఒక సెక్షన్‌కు చెందినవారు గుండెలు బాదుకుంటున్నరు. ఇక రోజూ పత్రికల్లోనైతే ఐదెకరాలు... పదెకరాలు... బలిసిన రైతు... బక్క రైతు... అని విభజించి కోతల కత్తిని మరింత బలంగా ఝుళిపించాలని ఆత్రుత పడుతున్నరు. రైతుబంధు దుర్వినియోగం... పది లక్షల ఎకరాలు అని ఒకరు, కాదు, మూడు లక్షల ఎకరాలు అని ఇంకొకరు, కాదు కాదు రెండు లక్షల ఎకరాలని మరొకరు. 2018 నుంచి తెలంగాణ ప్రభుత్వ ఖజానాను మొత్తం రైతులే దిగమింగారనే రీతిలో ప్రచారం చేస్తున్నది. ఐరాస ప్రశంసించిన బృహత్తర పథకాన్ని నిర్వీర్యం చేయాలనుకుంటున్నరు. 'ఇప్పుడైతే ఎకరాకు ఐదు వేలే, మేమొస్తే ఎకరాకు రూ.7,500' అన్న హామీకి నీళ్లొదిలి ఏడాదికిపైగా ఒక రైతు సంక్షేమ పథకాన్ని ఈ స్థాయిలో అంపశయ్యపై నిలిపిన ఘనత రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ గ్రామీణ పరిస్థితులు.. ఆపై కేసీఆర్ హయాంలో ఉచిత కరెంటు, రైతుబంధు, సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంతో గ్రామీణ తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రం ఎలా మారిందనే వాస్తవాలు మన కండ్లముందే ఉన్నాయి.

ఓ రెండు, రెండున్నర దశాబ్దాల కిందట తెలంగాణలో ఎండకాలం వచ్చిందంటే... ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు తెగ సంబురపడిపోయేవాళ్లు. కరువు మండలాల ప్రకటన.. ఆ ఎమ్మటే వచ్చే కరువు

నిధుల కోసం వెయ్యి కండ్లతో ఎదురుచూసే వాళ్లు. అవి రాంగనే... తిలా పాపం... తలా పిడికెడు అన్నట్టు నేతలంతా ఎంపీడీవో కార్యాలయాల్లోనే కూర్చొని మారుమూల ప్రాంతాల్లో మట్టి రోడ్లు వేసేవాళ్లు. ఏండ్ల తరబడి చుక్క నీటికి నోచుకోని వరైల మధ్య చెక్ డ్యాంలు సైతం కట్టేవారు. ఎంత చెట్టుకు అంత గాలి... బడా నేతల నుంచి గ్రామస్థాయి నాయకుల వరకు కరువు నిధుల పంపిణీ అనేది న్యాయబద్ధంగా జరిగిపోయేది. ఆ తర్వాత గ్రామస్థాయి నేతలు కొత్త స్ప్లెండర్లు కొని తమ ఊర్లల్లోకి పోతే... వలసలు పోగా మిగిలిన ఆ పది మంది ఆయన చుట్టూ గూమి గూడేవాళ్లు. చికెన్... మటన్... మందు... రెండు, మూడు రోజుల మస్తు దావత్‌లు! ఆ ఊర్లో ఏదైనా బొడ్రాయి పండుగ జరగాలన్నా... చిన్న దేవుడి కార్యం జరుపాలన్నా ఆ స్ప్లెండర్ నాయకుడు కరుణిస్తేనే!! అందుకే సీనియర్ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ అన్నట్టు.. దేశంలో ఏ కొత్త మోడల్ కారు వచ్చినా ఉమ్మడి ఏపీలో అప్పట్లో దుర్భిక్ష ప్రాంతంగా ఉన్న రాయలసీమ ప్రాంతంలోనే మొదటగా రయ్‌మంటుందట. అదీ కరువు నిధులకున్న మహత్తు.

> **దశాబ్దాల పాటు వ్యవసాయానికి దూరమై ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తెలంగాణ రైతును ఆర్థికంగా భుజం తట్టేందుకు మన పాలకులకు చేతులు రావడం లేదు. కొందలు, గుట్టలు, వెంచర్లు అంటూ రైతులను మభ్యపెట్టేందుకు పావులు కదుపుతూనే ఉన్నారు. మీడియా, ఇంకొందరు కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు ఎగ్గొట్టిన పెట్టుబడి సాయాన్ని తెర మీదకు రాకుండా అడ్డమైన వాదనలతో చర్చను పక్కదారి పట్టిస్తున్నారు.**

మరి.. తెలంగాణ ఏర్పడిన తర్వాత కరువు నిధులు అనే పదమే వినపడటం లేదు. బహుశా 2014-15లో ఒకసారి కేసీఆర్ ప్రభుత్వం కరువు మండలాల జాబితా కేంద్రానికి పంపిందనుకుంట. ఆపై పంపలేదు. కారణం... కరువు మండలాల ప్రకటనకు అనుగుణంగా తెలంగాణలో అలాంటి పరిస్థితులు రాలేదు.

> **అంటే గత పదేండ్లలో కరువు ఛాయలు అనేవి తెలంగాణ దరిదాపుల్లోకి రాలేదన్న మాట. ఏ జిల్లాలో ఎన్ని కరువు మండలాలు అని గతంలో చూసుకునేవాళ్లు. ఇప్పుడు ఏ జిల్లాలో ఎంత ధాన్యం పండిందంటూ పోటీపడే స్థాయికి తెలంగాణ రైతాంగం ఎదిగింది. అందుకే గత ఐదారేండ్లలో ఏ చిన్న గ్రామంలో చూసినా బొడ్రాయి పండుగ అంటే చాలు, ఏ నాయకుడి దయాదాక్షిణ్యం మీదనో కాకుండా! ప్రతి ఒక్క రైతు కుటుంబం పట్నంలోని తమ పిల్లల్ని పిలుచుకొని సొంతంగా యాటను కోసుకొని రెండు, మూడు రోజుల పాటు సంబురాలు చేసుకుంటున్నది.**

పంట వేసేముందు రైతుబంధు... పంట చేతికి రాగానే వడ్ల పైసలు! రైతుల జేబులు బరువుగా మారి పల్లె గల్లాపెట్టె గలగలలాడింది. తెలంగాణ రైతు అంటే చెయ్యి పైకిపెట్టి ఒకరికి ఇచ్చెటోడేగానీ చేయి చాచి అడుక్కునే వాడు కాదన్నట్టుగా గ్రామీణ ప్రాంతాలు కళకళలాడాయి. రాజకీయాలు నేతలు ఎరుగు! నిజంగా ఒక తెలంగాణ రైతుగా ఆలోచిస్తే... బతుకనీక ఎక్కడికి పోవాలె అన్న ఆలోచన నుంచి పొట్ట, బట్టకు సావు లేకపోవడమే కాదు పిల్లలను ఎక్కడ సదివియ్యాలి? అన్న ఆలోచన దాకా వచ్చిండు. తెలంగాణ సమాజం మొత్తం సంతోషపడాల్సిన నిజమైన మార్పు అంటే ఇది.

దేశ చరిత్రలోనే ఎన్నడూలేని విధంగా, ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి ఊహలకు కూడా అందని రీతిలో కేసీఆర్ ప్రభుత్వం 11 సార్లు ఏకంగా సుమారు రూ.73 వేల కోట్లతో తెలంగాణ రైతులకు రైతుబంధు పేరుతో చేయూతనందించింది. ఏ సావుకారు దగ్గర చెయ్యి సాపకుండా... ఏ ఫర్టిలైజర్ దుకాణం యజమాని ముందు బాకీ కోసం మోకరిల్లకుండా, బ్యాంకులోకెళ్లి రైతుబంధు పైసలు డ్రా చేసుకొని దర్జాగా విత్తనాలు, ఎరువులు కొనుక్కొని తలెత్తుకొని వ్యవసాయం చేసుకునేలా చేసింది. రైతుబంధు పథకంలో ఒక చోట లే అవుట్‌కు నిధులు రావచ్చు, ఇంకోచోట గుట్టలకు పైసలు పోవచ్చు. ఒకరిద్దరు అనర్హులు కాదు ముఖ్యం, వంద మంది బక్క రైతులు ప్రధానం అనే సూత్రాన్ని కేసీఆర్ ప్రభుత్వం పాటించింది. దశాబ్దాల పాటు గోసపడిన తెలంగాణ రైతుకు ఉచితంగా కరెంటు ఇస్తున్నం, కడుపు నిండా తాగునీళ్లు ఇస్తున్నం, ఒక్క పెట్టుబడి సాయం అందిస్తే తన కాళ్ల మీద తాను నిలబడుతాడని ఆశించింది. కానీ గత ఏడాది కాలంగా ఏం జరుగుతున్నది? ఆ ఒకరిద్దరు అనర్హుల అంశాన్నే ప్రధాన ఎజెండాగా మార్చారు. వంద మంది రైతుల ప్రయోజనాలను గాలికొదిలారు. తెలంగాణ రైతుకు సాయం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాలు... రౌండ్ టేబుళ్లు. అయ్యయ్యో! రైతుబంధు పేరుతో కేసీఆర్ కోట్ల రూపాయలను దుర్వినియోగం చేశారంటూ ఓ సెక్షన్ మేధావివర్గం గళమెత్తితే... దానిని సరి చేసేందుకే మేధోమథనం చేస్తున్నాం! అందుకే రైతుబంధు ఉరఫ్ రైతు భరోసా ఆలస్యమైతుందంటూ కాంగ్రెస్ సర్కారు రెండు సీజన్ల పెట్టుబడి సాయానికి ఎగనామం పెట్టింది.

నిజంగా... తెలంగాణ రైతు కేసీఆర్ ప్రభుత్వంలో సర్కారు ఖజానాను మొత్తం కొల్లగొట్టారా?! తెలంగాణ గోస, ఉద్యమ చరిత్రపై ఇసుమంత అవగాహన లేని ఇతర ప్రాంత వ్యక్తులు ఎవరైనా... గత కొంతకాలంగా మీడియాలోని కథనాలు, ప్రభుత్వంలోని పెద్దల ప్రకటనలు చూస్తే నిజమే అనుకుంటరు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇన్ని లక్షల ఎకరాలు... అన్ని లక్షల ఎకరాలు... రైతుబంధు దుర్వినియోగమంటూ పత్రికలు రైతుల పెట్టుబడి సాయాన్ని హరాజ్ పాడుతుంటే రైతులు ఎన్ని లక్షల కోట్లు దిగమింగారోనని ఆశ్చర్యపోతారు. గత పదేండ్లలో బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకులకు ఎగ్గొట్టి... మాఫీ చేయించుకున్న మొండి బకాయిల మొత్తం రూ.15 లక్షల కోట్ల పైమాటే. అదే బ్యాంకుల జాతీయీకరణ జరిగిన తర్వాత నేటిదాకా లెక్కిస్తే ఆ మొత్తం రూ.25 లక్షల కోట్లకు పైగా ఉన్నది. వెనుక ఏనుగు పోయినా సరే.. అన్నట్టు ఆ మొండి బకాయిల మాఫీ కంటే రైతుబంధులో అనర్హులకు పోయిందే ఎక్కువ అన్నట్టు చిత్రీకరిస్తుండటం విడ్డూరంగా ఉన్నది.

> **బ్యాంకులకు వేల కోట్లు ఎగనామం పెట్టి విదేశాల్లోని బీచుల్లో జల్సా చేసుకుంటున్న విజయ్ మాల్యా వంటి వాళ్ల విలాసవంతమైన జీవితాన్ని సామాజిక మాధ్యమాల్లో ఆసక్తిగా చూసేవాళ్లు.. ఇక్కడ ఊర్లల్ల ఓ రైతు పొద్దంతా కాయకష్టం చేసి సాయంత్రం గింత మందు తాగితే అగో రైతుబంధు పైసలు వైన్ షాపులకే పోతున్నాయనే కుంటిసాకులు వెంట పడ్డారు. దీన్ని అడ్డం పెట్టుకొనే పాలకులు ఏరు దాటినంక తెప్ప తగలేసినట్టు రైతులకు పెట్టుబడి సాయం పథకానికి తూట్లు పొడుస్తున్నారు.**

ఎవరి ఊహలకు కూడా అందని రైతుబంధు అనే గొప్ప పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన తర్వాత ఏకంగా భారత ప్రభుత్వమే అనుసరించడమంటే అది సాధారణ విషయం కాదు. నిజంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే పథకమైతే కేంద్రం ఎందుకు ఆచరిస్తుంది? ఆ సాయాన్ని మరింత పెంచేందుకు ఎందుకు సాహసిస్తుంది? కేంద్రమే కాదు, దేశంలోని కర్ణాటక, ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ ఇలా అనేక రాష్ట్రాలు సైతం రైతుబంధు పథకాన్ని తమ తమ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో అమలుచేస్తున్నాయి. అంతెందుకు... దశాబ్దాల నుంచి సాగునీటి సౌకర్యం మెరుగ్గా ఉన్న ఏపీ ప్రభుత్వం కూడా రైతుకు పెట్టుబడి సాయాన్ని కొనసాగిస్తున్నది. కానీ, దశాబ్దాల పాటు వ్యవసాయానికి దూరమై ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తెలంగాణ రైతును ఆర్థికంగా భుజం తట్టేందుకు మన పాలకులకు చేతులు రావడం లేదు. కొందలు, గుట్టలు, వెంచర్లు అంటూ రైతులను మభ్యపెట్టేందుకు పావులు కదుపుతూనే ఉన్నారు. మీడియా, ఇంకొందరు కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు ఎగ్గొట్టిన పెట్టుబడి సాయాన్ని తెర మీదకు రాకుండా అడ్డమైన వాదనలతో చర్చను పక్కదారి పట్టిస్తున్నారు.

ఇది ఇప్పటితో పోయేది కాదు, కాంగ్రెస్ ప్రభుత్వం తాను ఇచ్చిన హామీ కంటే ఎకరానికి రూ.1500 తక్కువ చేసి ఈ నెల 26 నుంచి ఇస్తామంటున్న రైతు భరోసా అమలు ఎలా ఉంటుందనేది మున్ముందు చూడబోతున్నాం. ముందు చెప్పుకొన్నట్టు... ఇదేదో స్థానిక సంస్థల ఎన్నికల గండాన్ని తప్పించుకునేందుకు అనివార్యమైన అమలుగా కొందరు చెప్తున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి గతంలో అసెంబ్లీలో ఇచ్చిన నివేదికలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు అమలులో భాగంగా ఐదేండ్లలో సుమారు రూ.22 వేల కోట్లు సాగుకు యోగ్యం కాని భూములకు అందాయని చెప్పారు. లోతుగా పరిశీలిస్తే... వర్షాకాలంలో పత్తి, మొక్కజొన్న, వేరుశనగ లాంటి మెట్ట పంటల సాగు విస్తీర్ణం తెలంగాణలో భారీగా ఉంటుంది. యాసంగిలో ఈ విస్తీర్ణం కనిపించదు. ఈ క్రమంలో అంకెల్లో ఎకరాల ఆంక్షలతో పాటు సాగుయోగ్యం... అనే సాకుతో ఆయా సీజన్‌లో పంటలు వేసిన వాటికే పెట్టుబడి సాయం అనే మరో కత్తిని కూడా రైతుల మెడ మీద పెడతారనే సంకేతాలు లేకపోలేదు. ఇదే జరిగితే... ఐదేండ్ల పాటు తెలంగాణ రైతాంగానికి ఆర్థిక పరిపుష్టిని అందించిన అద్భుతమైన పథకానికి మరిన్ని తూట్లు పడి జల్లెడలా మారే ప్రమాదం ఉన్నది. ■

పౌరసత్వం కోసం ప్రసవాలు

పుట్టిన దేశాన్ని వీడి అమెరికాలోనే శాశ్వత నివాసం ఏర్పర్చుకున్న వాళ్లు కోకొల్లలు. పౌరసత్వం కోసం శతవిధాలా ప్రయత్నించేవాళ్లు తండోపతండాలు. అది వాళ్ల హక్కు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే అమెరికా పౌరసత్వం అనివార్యమని భావించే తల్లిదండ్రులున్నారు. ఆ మోజు ఎంతటి విపరీత ధోరణికి దారితీస్తున్నదంటే భావితరాల భవితవ్యాన్ని కూడా అంధకారంలో పడేసేందుకూ అమెరికాలోని భారతీయ పౌరులు వెనుకాడటం లేదు.

ఇనుగుర్తి సత్యనారాయణ
97046 17343

అమెరికా కొత్త అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలో పుట్టే పిల్లలకు ఆ దేశ పౌరసత్వం వస్తుంది. దీన్ని యూఎస్ బర్త్ రైట్ సిటిజన్‌షిప్ అంటారు. అమెరికాకు వలసవెళ్లిన వారికి అక్కడ పిల్లలు పుడితే వారికి జన్మతః పౌరసత్వం వస్తుంది. 1868లో అమెరికా 14వ సవరణ ద్వారా ఈ హక్కును ఆ దేశ రాజ్యాంగంలో చేర్చారు. ఇప్పుడు ఆ హక్కును రద్దు చేస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమ వలసదారులకు, తాత్కాలిక వీసాపై అమెరికాకు వచ్చిన వారికి స్థానికంగా పిల్లలు పుడితే తమ దేశం పౌరసత్వం ఇచ్చే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. ఈ విధానం ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి రానున్నది. అంటే ఫిబ్రవరి 19 వరకు పుట్టే పిల్లలకు మాత్రమే పుట్టుకతో అమెరికా పౌరసత్వం వస్తుంది.

> **అందుకే... 'అమ్మ' ఆత్మ ఆతృతపడుతున్నది. 7, 8 నెలల గర్భిణులుగా ఉన్న తల్లులు ముందస్తు ప్రసవాలకు సిద్ధమవుతున్నారు. అమెరికా, భారత జాతీయ మీడియా కథనాల ప్రకారం.. అమెరికాలోని భారతీయ మహిళలు 2 రోజులుగా ప్రసూతి దవాఖానలకు పోటెత్తుతున్నారు. 7 నెలలు నిండని గర్భిణులు కూడా ప్రసవాలకు ప్లాన్ చేస్తున్నట్టు అమెరికాలోని భారతీయ వైద్యులు ఆ కథనాల్లో పేర్కొంటున్నారు.**

అమెరికాలో హెచ్-1బీ, ఎల్-1 తాత్కాలిక వీసాలపై లక్షల మంది జీవిస్తున్నారు. వీళ్లంతా అమెరికాలో శాశ్వత పౌరసత్వం కోసం ఇచ్చే గ్రీన్‌కార్డు కోసం నిరీక్షిస్తున్నారు. 'తాము ఆరేండ్లుగా గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నామని, ఇదొక్కటే తమకు స్థిరత్వాన్ని ఇవ్వగలదు' అని ప్రియా అనే ఓ గర్భిణీ చెప్తున్నది. తమ బిడ్డ అమెరికాలో పుడితే జన్మతః పౌరసత్వం వస్తుందని ఎదురు చూశామని, ట్రంప్ నిర్ణయంతో భయాందోళనకు గురైనట్టు ఆమె తెలిపారు. 'చాలా త్యాగాలు చేసి అమెరికా వచ్చామని, కానీ, ట్రంప్ నిర్ణయంతో దారులు మూసుకుపోయాయనే భావన కలుగుతున్నది' అని ఓ తండ్రి చెప్తున్నారు. 'తమకు పుట్టే బిడ్డ ద్వారా పౌరసత్వం వస్తుందని భావించామని, ఇప్పుడు తమకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది' అని ఆయన ఆందోళన చెందుతున్నాడు.

పిల్లల ద్వారా పౌరసత్వం పొందేందుకు ప్రయత్నిస్తున్న తల్లిదండ్రులు చాలా రిస్క్ చేస్తున్నారు. నెలలు నిండకున్నా ముందస్తు ప్రసవాల కోసం సిద్ధమవుతున్నారు. దీనివల్ల తల్లీ బిడ్డలిద్దరికీ ప్రాణాపాయమని వైద్యులు చెప్తున్నా, పౌరసత్వమే జీవిత పరమావధిగా వారు భావిస్తున్నారని అక్కడి వైద్యుల మాటల్లో స్పష్టమవుతున్నది. అంటే, ఇప్పుడు పౌరసత్వం కోసమే ముందస్తు ప్రసవాలకు మొగ్గు చూపడం వల్ల.. ప్రసవం సమయంలో సమస్యలు గట్టెక్కినా.. ఆ తర్వాత పరిస్థితి ఏమిటి? నెలలు నిండని బిడ్డ జీవితాంతం సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు చెప్తున్నారు. ఊపిరితిత్తులు ఎదగకపోవడం, నాడీ వ్యవస్థకు సంబంధించిన సవాళ్లతో బాధపడాల్సి ఉంటుంది.

ఉన్న ఊరు కన్నతల్లి వంటిదని మన పెద్దలు ఏనాడో చెప్పారు. బతుకుదెరువు కోసం ఎవరు ఎక్కడికి వెళ్లి జీవించినా తిరిగి రావాల్సింది సొంత గ్రామానికే. అయినా ప్రపంచం కుగ్రామమైన నేపథ్యంలో ఎవరు ఎక్కడ నివసిస్తే ఏమున్నది. అమెరికా పౌరసత్వ మోజులో పడి నిండు గర్భిణుల ప్రాణాలను పణంగా పెట్టడం భావ్యమేనా? భావితరాల బతుకును ప్రశ్నార్థకం చేయడం సమంజసమేనా? ముమ్మాటికీ కాదు. అందుకే... మాతృ దేశానికి దూరంగా జీవిస్తున్న భారతీయులు కనీసం మాతృత్వపు మాధుర్యాన్నైనా ఆస్వాదించాలి. ఎవరో దయతలచి ఇచ్చే పౌరసత్వం కోసం కన్న పేగును దూరం చేసుకోవద్దు. కడుపు కోతను మిగుల్చుకోవద్దు. అమ్మతనాన్ని అవహేళన చేయవద్దు.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

దావోస్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఐటీ నిపుణులు, ఉద్యోగులను దారుణంగా అవమానించారు. ఇందుకు ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలి. ఆ వ్యాఖ్యలు కేవలం ఐటీ నిపుణులను అగౌరవపర్చడమే కాకుండా ఐటీ హబ్‌గా ఉన్న తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయంగా మసకబార్చేలా ఉన్నాయి. రాష్ట్ర ప్రగతికి తోడ్పడుతూ ప్రపంచంలో భారతదేశాన్ని సగర్వంగా నిలబెట్టేందుకు ఐటీరంగం తోడ్పడుతున్నది. అటువంటి రంగంలో పనిచేసే ఉద్యోగులు, నిపుణులను అవహేళన చేయడం ఐటీరంగం గొప్పదనాన్ని అవమానించడమే అవుతుంది.

ఐటీపై సీఎం అనుచిత వ్యాఖ్యలు

దాసోజు శ్రవణ్‌కుమార్

మానవ వనరుల రంగంలో అధ్యాపకుడిగా, అభ్యాసకుడిగా ప్రతి వృత్తికి అత్యంత ప్రాధాన్యం ఉంటుందని విశ్వసించే వ్యక్తిగా సూచిస్తున్నాను. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపీఈ)లో అధ్యాపకుడిగా, పలు ఐటీ కంపెనీల్లో మానవ వనరుల విభాగాధిపతిగా పనిచేసిన వ్యక్తిగా ఏ ఉద్యోగమూ అల్పమైనది, ఏ వ్యక్తీ అల్పుడు కాదని భావిస్తాను. ఐటీ ఉద్యోగులు, పరిశ్రమ కార్మికులు లేదా రైతులు ఇలా ప్రతీ ఒక్క రంగంలోని శ్రమ జీవులు సమాజ పురోగతికి తోడ్పడుతా రు. దేశ నిర్మాణం, ఆర్థికవ్యవస్థ బలోపేతంలో వారందరి భాగస్వామ్యం ఉంటుంది. మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ చెప్పినట్టుగా ఏ పనీ అల్పమైనది కాదు. మానవీయతను ఉన్నతంగా నిలిపే ప్రతీ శ్రమకు గౌరవం, ప్రాముఖ్యం ఉన్నాయి. ఆ పనిని అత్యంత నాణ్యతతో చేయాల్సిన అవసరం ఉన్నదని ఆయన చెప్పాడు.

జాతి పిత మహాత్మా గాంధీ కూడా శ్రమ గౌరవాన్ని గురించి గొప్పగా చెప్పారు. నూలు వడికే రాట్నంలోని చక్రం శ్రమ గౌరవానికి ప్రతీక అని అన్నారు. మనిషి శ్రమ, ఆత్మనిర్భరత, గౌరవానికి చిహ్నమని తెలిపారు. ఆ చక్రం సామాన్యమైన పరికరమే అయినా సమాజాన్ని మార్చగల శక్తిని కలిగి ఉందని కొనియాడారు. ఏ పని కూడా చిన్నది కాదని, ప్రతీ వ్యక్తి నిజాయితీ, అర్థవంతమైన కృషిలోనే గౌరవం దాగి ఉన్నదని వివరించారు. ఈ మాటలు ఐటీ రంగానికి, నిపుణులకు కూడా వర్తిస్తాయి. చరఖా చక్రం మాదిరిగానే ఐటీ ఉద్యోగులు, నిపుణులు నిశ్శబ్దంగా తమ సృజనాత్మకత, నిబద్ధతతో పారిశ్రామిక అభివృద్ధితో పాటు లక్షల జీవితాల్లో వెలుగులు నిం పుతున్నారు. ఆర్థిక ప్రగతి, సాంకేతిక మార్పు, దేశాభివృద్ధికి దోహదపడుతున్నారు. ఐటీ ఉద్యోగులు, నిపుణులను పనివాళ్లు అని సంబోధిస్తూ తాజాగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు వారి శ్రమగౌరవాన్ని చులకన చేయడంతో పాటు వారు మన రాష్ట్రం, దేశానికి చేస్తున్న సేవలను తక్కువ చేసి చూపినట్టుగా ఉన్నాయి. కష్టపడే ఉద్యోగులు, నిపుణుల మనోబలాన్ని దెబ్బతీయడమే కాకుండా ఐటీపరంగా అద్భుతమైన అనుకూల వాతావరణం కలిగిన, అత్యున్నత స్థాయి మేధోసంపత్తి కలిగిన తెలంగాణ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఐటీ రంగాన్ని, నిపుణులను అవమానిస్తూ వ్యాఖ్యలు చేయడం సీఎం రేవంత్‌రెడ్డికి ఇది తొలిసారి కాదు. ఇంతకు ముందు కూడా ఐటీరంగ అభివృద్ధి అనేది న్యూక్లియర్ చైన్ రియాక్షన్ అంటూ మాట్లాడారు. అభివృద్ధికి, సాంకేతికత పెంపొందించేందుకు పాటుపడిన వారి కృషిని సీఎం రేవంత్‌రెడ్డి అర్థం చేసుకోలేదని స్పష్టమవుతున్నది. సంపద సృష్టి, ఆర్థికాభివృద్ధి, సామాజిక పరివర్తనలో ఐటీరంగం కీలక పాత్ర పోషిస్తున్నది. కానీ ఆ రంగానికి తగిన గౌరవం, గుర్తింపును ముఖ్యమంత్రి ఇవ్వకపోవడం శోచనీయం.

ముఖ్యమంత్రిగా సమాజంలోని అట్టడుగు వర్గాలతో పాటు అందరి పట్ల గౌరవం, బాధ్యతతో మెలగాలి. కానీ దేశ ప్రగతికి, ప్రపంచ పురోగతికి దోహదపడుతున్న ఓ రంగం మొత్తంపై ఆయన అసహనం, అహంకారం, అవగాహన రాహిత్యంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ధోరణి ముఖ్యమంత్రి పదవిలో ఉన్న ఏ నాయకుడికీ సరికాదు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల తీవ్రతను, దుష్ప్రభావాలను గుర్తించి, ఆయన లోతుగా ఆలోచించాలి. ఐటీ వృత్తి నిపుణుల నమ్మకాన్ని, మనోధైర్యాన్ని నిలబెట్టేందుకు, కష్టపడి పనిచేసే తెలంగాణ పౌరుల పట్ల నిబద్ధతను నిరూపించుకునేందుకు ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పి తీరాల్సిన అవసరం ఉన్నది. అంతేకాకుండా ఐటీరంగం పనిచేసే తీరును, గొప్పదనాన్ని గురించి అవగాహన కలిగించుకునేందుకు సమయం కేటాయించుకోవాలి. ఆయన ప్రసంగాల్లో సున్నితత్వం లోపించింది. కాబట్టి ఆయన మాట్లాడే పద్ధతి మార్చుకోవాలి.

ప్రసంగాలు ఇచ్చేటప్పుడు జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఐటీరంగం ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమక